సాక్షి చిత్తూరు

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



గెలుపే లక్ష్యం.. సమష్టిగా పయనం

వైఎస్సార్‌సీపీ నేతలు విభేదాలను వీడి ఏకతాటిపైకి వచ్చారు. మంత్రి రోజా గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. - 8లో



నామినేషన్లకు వేళాయె

జిల్లాలో నేటి నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. - 8లో



బోరు కేబుల్ చోరీ

చౌడేపల్లె మండలం జంగాలపల్లెలో తాగునీటి బోరుకు అమర్చిన కేబుల్‌ను దుండగులు అపహరించారు. - 8లో

న్యూస్‌రీల్

గంగమ్మకు 'మకర తోరణం'



మకరతోరణం అందిస్తున్న దాత రాజేష్

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మకు ఇత్తడి మకర తోరణాన్ని ఆలయ కమిటీ సభ్యుడు రాజేష్ శుక్రవారం విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఉత్సవమూర్తికి మకరతోరణం అలంకరించేందుకు అందించినట్లు వివరించారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వీరకుమార్, సిబ్బంది కృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, హరిప్రసాద్, వశిష్టా చార్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు

చిత్తూరు రూరల్: జిల్లాలో గురువారం నుంచి నామినేషన్ల కోలాహలం మొదలుకానుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న నేపథ్యంలో తొలిరోజే నామినేషన్ వేయాలని పలువురు అభ్యర్థులు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల సమర్పణకు అవకాశం ఉంది. ఈ మేరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు మంచి ముహూర్తాల కోసం పండితులు, సిద్ధాంతులను ఆశ్రయిస్తున్నారు. ఆయా అభ్యర్థుల జాతక చక్రాలు, నామ/జన్మ నక్షత్రాలకు అనుగుణంగా ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. పంచాంగం ప్రకారం చూస్తే ఈనెల 18, 19, 21, 22, 24, 25 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయని వేదపండితుడు సుధాకర్ గురుకుల్ తెలిపారు.

ఆదర్శనీయులు 'ఆంధ్రకేసరి'



కరుణకుమార్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని, తెలుగు జాతి కీర్తికిరీటమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్ కొనియాడారు. బుధవారం చిత్తూరులోని పలమనేరు రోడ్డులో ఉన్న భారతీయ తెలుగు రచయితల సమాఖ్య కార్యాలయంలో వ్యవస్థాపకులు మర్రిపూడి దేవేంద్ర రావు నేతృత్వంలో సాహితీవేత్తలు, సంఘసేవకులకు 'ఆంధ్రకేసరి' జాతీయ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రకాశం పంతులు పాత్రను గమనిస్తే రోమాంచిత ఘట్టాలెన్నో కనిపిస్తాయన్నారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణ స్వామి మాట్లాడుతూ దేశప్రజల ఆక్రోశానికి సారథిగా నిల్చి ప్రకాశం పంతులు ఆంధ్రకేసరిగా పేరుపొందారని తెలిపారు. అనంతరం కరుణకుమార్‌కు 'న్యాయవిభూషణ' బిరుదును దేవేంద్రరావు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి, లావణ్య, సోము ఉమాపతి, సి. సుబ్రమణ్యంరెడ్డి, తోట గోవిందన్, ఆదివిష్ణు బాలచంద్ర, పాలకూరు కన్నయ్య, గొడుగుచింత గోవింద య్య, సంఘ సేవకులు కోటేశ్వర మొదలియార్, కడియాల ఆనందనాయుడు, జ్ఞానశేఖరరెడ్డి పాల్గొన్నారు.

బీసీ సామాజికవర్గాన్ని చంద్రబాబు కరివేపాకులా వాడుకుని వదిలేస్తున్నారని ఆ సామాజిక వర్గం నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తమకు మొండిచెయ్యే చూపుతున్నారని రగిలిపోతున్నారు. టీడీపీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కేవలం రెండు సార్లే బీసీలకు సీట్లు ఇవ్వడం చూస్తుంటే తమ సామాజికవర్గంపై బాబుకు ఎంత పగ ఉందో అర్థమవుతోందని పలువురు నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. బీసీలకు మారుపేరుగా ఉన్న కుప్పం నియోజవకార్గన్ని సైతం కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారని చర్చించుకుంటున్నారు. ఈ సారి ఎన్నికల్లోనూ తన కుటిల బుద్ధి చూపి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తన సామాజిక వర్గానికి నాలుగు సీట్లు కట్టబెట్టి.. తమకు ఒక్క సీటూ ఇవ్వలేదని లోలోపలే రగిలిపోతున్నారు. ఈ ఎన్నికల్లో బాబును ఓడించి తీరుతామని పలువురు నేతలు తెగేసి చెబుతున్నారు.



బాబు ఇంతేకదమ్మ!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీలకు ఒక్కసీటూ ఇవ్వని కపట కూటమి
- కుప్పం, నగరి, తిరుపతి, వెంకటగిరి, పలమనేరు కోసం బీసీ నేతల ప్రయత్నం
- బాబు సామాజిక వర్గానికే నాలుగు టికెట్లు
- టీడీపీని నమ్ముకున్నా బీసీలను పట్టించుకోని చంద్రబాబు
- టీడీపీకి దూరంగా ఉండాలని నిర్ణయం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 33,59,457 మంది బీసీలు ఉన్నారు. ఇందులో బీసీ ఓటర్లే సుమారు 11 లక్షలు. ఓసీ ఓటర్లు సుమారు 8 లక్షలు ఉండొచ్చని అధికారులు చెబుతున్న లెక్కలు. ఇంత పెద్ద మొత్తంలో ఓటర్లు ఉన్న బీసీ సామాజిక వర్గానికి టీడీపీ కానీ జనసేన, బీజేపీ ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అదే చంద్రబాబు సామాజికవర్గానికి మాత్రం ఏకంగా నాలుగు సీట్లు కేటాయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఇద్దరు బీసీ సామాజికవర్గం వారికి టికెట్లు ఇచ్చి వారి పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంది. ఆ ఇద్దరిలో చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా భరత్‌కృష్ణ ఒకరైతే.. పలమనేరు నియోజకవర్గానికి వెంకటేగౌడ్‌కి టికెట్ ఇచ్చి బీసీలను గౌరవించింది.

మూడున్నర దశాబ్దాలుగా బీసీలకు అన్యాయం

బీసీలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కుప్పం మొదటిది. అటువంటి కుప్పం నియోజకవర్గాన్ని ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. గత 35 ఏళ్లుగా కుప్పంలో బీసీలకు ఎమ్మెల్యే పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారు. బీసీల అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో మలచుకుంటూ బీసీలను దగా చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఉంటే.. అందులో 23.29 శాతం ఓట్లు వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం వారివే. టీడీపీ పుట్టినప్పటి నుంచి కేవలం వెయ్యి ఓట్లు కూడా లేని కమ్మ సామాజికవర్గం కుప్పాన్ని ఆక్రమించుకుని బీసీలను అణగదొక్కుతూ వస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టినప్పటి నుంచి కుప్పంలో బీసీలకే పెద్దపీట వేస్తూ వస్తోంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన భరత్‌కృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బీసీలను గౌరవించింది. సీఎంగా, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హైదరాబాద్, అమరావతికే పరిమితమైనా.. కుప్పంలో పెత్తనం కూడా కమ్మ సామాజిక వర్గం వారికే అప్పగించారు. టీడీపీ పురుడు పోసుకున్నప్పటి నుంచి కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకే ఒక సారి శ్రీకాళహస్తి, పుంగనూరు అసెంబ్లీ స్థానాలకు బీసీ అభ్యర్థులను బరిలోకి దింపింది. అంతకుమించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ బీసీలకు టికెట్లు ఇచ్చి గౌరవించిన దాఖలాలు లేనే లేవు.

బాబు కులస్తులకే పెద్దపీట

కుప్పం మొదలు.. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన సామాజిక వర్గానికే చంద్రబాబు పెద్ద పీట వేస్తూ వచ్చారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ అభ్యర్థులను పరిశీలిస్తే.. కుప్పం అభ్యర్థిగా చంద్రబాబు, చిత్తూరు అభ్యర్థిగా గురజాల జగన్మోహన్ (కమ్మ), నగరి నుంచి గాలి భానుప్రకాష్ (కమ్మ), వెంకటగిరి అభ్యర్థిగా లక్ష్మీసాయి ప్రియ (కమ్మ) వారిని చంద్రబాబు ప్రకటించారు. కుప్పం, పలమనేరు, చిత్తూరు, తిరుపతి, నగరి, వెంకటగిరి నియోజక వర్గాల నుంచి బీసీలు టీడీపీ టికెట్ ఆశించినా చంద్రబాబు కనీసం పరిగణలోకి కూడా తీసుకోలేదు. టీడీపీ పుట్టినప్పటి నుంచి జెండా మోస్తున్న నరసింహయాదవ్ (తిరుపతి) టికెట్ కోసం ప్రతి సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రయత్నించినా చంద్రబాబు కరుణించిన దాఖలాలు లేవు. నగరి టికెట్ కోసం మొదలియార్లు, వెంకటగిరి అసెంబ్లీ కోసం చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు టీడీపీ టికెట్ ఆశించినా చంద్రబాబు పట్టించుకోకపోగా ఆయన సామాజికవర్గం వారికే కట్టబెట్టి ×కమ్మ×టి ప్రేమను చాటుకుంటూ వస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఓటు బ్యాంకింగ్‌గా మార్చుకుంటూ పబ్బంగడుపుకుని వదిలేస్తున్న చంద్రబాబుకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి తీరుతామని బీసీ ఓటర్లు స్పష్టం చేస్తున్నారు.

"కులాలు.. మతాలు.. పార్టీలు చూడం.. పేదరికమే ప్రామాణికం.. ప్రజా సంక్షేమమే లక్ష్యం".. ఇవి కేవలం ప్రకటనలే కాదు.. నినాదాలతో ఆగిపోలేదు. అందరినీ సమదృష్టితో చూస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుపరిపాలన అందించింది. ప్రతిపక్ష నేత నియోజకవర్గమైన కుప్పంలోనూ సంక్షేమ వెలుగులు నింపింది. అందులో భాగంగా నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని వివక్ష లేకుండా అమలు చేసింది. గత ఐదేళ్లలో వేలాదిమంది కుప్పం ప్రజలకు ఆయువు పోసింది. ఇందుకోసం రాజీ పడకుండా కోట్లాదిరూపాయలు వెచ్చించింది.





కుప్పం ప్రజలకు అందిన ఆరోగ్యశ్రీ సేవల వివరాలు

సంవత్సరం	వైద్యం పొందిన వారు	వెచ్చించినమొత్తం (రూ.కోట్లలో)
2019-20	8,758	8.56
2020-21	4,736	6.52
2021-22	6,941	8.15
2022-23	9,142	12.71
2023-24	8,914	9.02

ఆరోగ్య కుప్పం!

- ప్రజల పాలిట సంజీవనిగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా వివక్ష లేని సేవలు
- ఐదేళ్లలో 29,572 మందికి చికిత్సలు
- పేదల వైద్యానికి రూ.44.96 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

శాంతిపురం : సకాలంలో నాణ్యమైన వైద్యం అందక ఒక్క ప్రాణం కూడా పోకూడదని, పేదలకు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందుబాటులోకి రావాలనే మహోన్నత ఆశయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ విశిష్ట పథకం లక్ష్యానికి తూట్లు పొడిచాయి. ముఖ్యంగా చంద్రబాబు హయాంలో సక్రమంగా నిధులు విడుదల చేయక ఆరోగ్యశ్రీని అటకెక్కించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఆరోగ్యశ్రీకి పునరుజ్జీవం పోశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 3,256 వ్యాధులను పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. వైద్య ఖర్చుల పరిమితిని ఏకంగా రూ.25లక్షలకు పెంచారు. రోగులు ఆస్పత్రికి రాను పోను చార్జీలను సైతం అందించేలా చర్యలు చేపట్టారు. చికిత్స అనంతరం రోగి కోలుకునే వరకు జీవనభృతిని సైతం అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు కూడా వెళ్లే వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలోనూ ప్రజలకు ఎలాంటి వివక్ష లేకుండా ఆరోగ్యశ్రీ సేవలను అందించారు. గత ఐదేళ్లలో ఒక్క కుప్పం నియోజకవర్గంలోనే సుమారు 29,572 మంది రోగులు ఆరోగ్యశ్రీ కింద నాణ్యమైన వైద్యసేవలు పొందారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ 44.96 కోట్లు ఖర్చు చేయడం విశేషం.

మరో జన్మనిచ్చింది



నేను రాతి క్వారీలో లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడిని. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. 2020 ఫిబ్రవరి 16వ తేదీన బండరాళ్లను లారీలో లోడింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రాయి జారి నా ఎడమ కాలిపై పడింది. కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి వెళితే కాలికి ఆపరేషన్ చేయాలన్నారు. నాకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దిక్కుతోచలేదు. వైద్యుల సలహా మేరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలో చేరిపోయా. పైసా ఖర్చు లేకుండా నాకు శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం నా వృత్తిని కొనసాగించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఆరోగ్యశ్రీనే నాకు మరో జన్మనిచ్చింది. – సుబ్రమణ్యం, గుడ్లనాయనపల్లె, కుప్పం మండలం

జగనన్నే బతికించాడు



నాకు 2022లో గుండె జబ్బు వచ్చింది. అస్వస్థతకు గురైన నన్ను కుటుంబ సభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారున. డాక్టర్లు పరీక్షలు చేసి గుండెలో రక్త నాళాలు పూడుకుపోయాయని, యాంజియోగ్రామ్ చేయాలని చెప్పారు. దీని కోసం రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుందనడంతో మాకు దిక్కుతోచలేదు. మిత్రుల సలహా మేరకు ఆరోగ్యమిత్రను సంప్రదించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా యాంజియోగ్రామ్ చేయించుకున్నాం. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో నా కుటుంబ ఖర్చుల కోసం బ్యాంకు ఖాతాలో రూ.4 వేలు జమ చేశారు. ఏడాది పాటు వాడాల్సిన మాత్రలను ఉచితంగా అందించారు. ఆరోగ్యశ్రీ పథకంతో జగనన్నే నన్ను బతికించాడు. – రాంబాబు, మఠం, శాంతిపురం

కాలు విరిగినా కోలుకున్నా



నేను శాంతిపురంలోని ఓ మొబైల్ షాపులో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నా. పాలారు నది వంతెనపై 2023 మార్చిలో జరిగిన ప్రమాదంలో నా కుడి కాలు విరిగిపోయింది. ప్రమాద సమయంలో అటుగా వెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్ నాకు సాయం చేశారు. వెంటనే నన్ను కుప్పంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కు తరలించారు. కాలి ఎముక పూర్తిగా విరగటంతో రాడ్డు వేయాలని వైద్యులు నిర్ణయించి, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు పూర్తిగా కోలుకుని మొబైల్ రిపేర్‌పై చిత్తూరులో శిక్షణ పొందుతున్నా. – భూపతి, మఠం, శాంతిపురం మండలం

ఆపదను అధిగమించాం



నేను నా ఇంట్లో చిల్లర కొట్టు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. 2023 డిసెంబర్‌లో అంగడి సరుకుల కోసం మోపెడ్‌పై కుప్పం వెళ్లి వస్తూ జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డా. 108లో నన్ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్య శ్రీ కింద రూ.50వేల విలువైన చికిత్సలు ఉచితంగా అందించారు. ప్రభుత్వ సాయంతోనే మా కుటుంబానికి వచ్చిన ఆపదను ఆధిగమించాం. అందుకే ఎప్పటికీ జగనన్న వెంటే ఉంటాం. ఆయనకు రుణపడి ఉన్నాం. – నాగరాజు, శెట్టిపల్లె, గుడుపల్లె మండలం

బోయకొండలో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయ కొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం నిర్వహించారు. అర్చకులు వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి ఆలయాన్ని మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. 10:30 నుంచి 12 గంటల నడుమ రాహుకాల అభిషేకం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్షలతో మొక్కులు చెల్లించుకున్నారు . ఉభయదారులకు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి చేతుల మీదుగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

పకడ్బందీగా ఎంసీసీ పర్యవేక్షణ

– టీడీపీ ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగికి నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నిబంధనల అమలును ఎంసీసీ బృందం పకడ్బందీగా పర్యవేక్షిస్తోంది. జిల్లా నోడల్ అధికారి మురళీకృష్ణ ప్రతి రోజు వస్తున్న ఫిర్యాదులు, పత్రికల్లో ప్రచురితమవుతున్న వార్తలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి విచారణ చేపడుతున్నారు. అందులో భాగంగా ఈ నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన టీడీపీ ప్రచారంలో ఉద్యోగి అనే వార్తను పరిగణనలోకి తీసుకున్నారు. విచారణ నిర్వహించి ఆ మేరకు తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయం టైపిస్ట్ దేవకుమార్‌కు షోకాజ్ నోటీసును జారీ చేశారు. 24 గంటల్లోపు లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే బంగారుపాళ్యం మండలం తుంబపాళెం జెడ్పీ హైస్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఆర్‌వి విక్రమ్ టీడీపీ కార్యకర్తలను పెట్టుకుని పంపిణీ చేసిన క్రీడాపరికరాలను సీజ్ చేయించారు.

ప్రతి పల్లెలో అభివృద్ధి పనులు

- ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- సాగు.. తాగునీరు అందిస్తాం
- ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం
- మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి

ప్రచార పర్వం



పులిచెర్లలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు) : పుంగనూరు నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో అభివృద్ధి పనులు పూర్తి చేశామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని 12 పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గండి కోట నుంచి నీరు తెచ్చి ఇక్కడ మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వీటి ద్వారా మూడు మండలాలకు సాగు..తాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి కొళాయిల ద్వారా ఇంటింటికీ తాగు నీరు అందిస్తామని తెలిపారు. ఇలాంటి మంచి పనికి చంద్రబాబు మోకాలడ్డారని, సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తామని, అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రారుణాలు మాఫీ చేస్తానని, మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టి ఆడ బిడ్డ పుట్టినప్పుడు వారి ఖాతాలో రూ.35 వేలు జమచేస్తానని మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాయమాటలను నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ప్రతి హామీ వందశాతం నెరవేర్చారని తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌ను ఎన్నుకుంటే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఇన్ని పథకాలను ప్రజలకు నేరుగా అందించే ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదని, భవిష్యత్ కూడా చూడలేమని వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు ఎమ్మెల్యేగా తనను, రాజంపేట ఎంపీగా మిథున్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, పార్టీ మండల కన్వీనర్ నాధమునిరెడ్డి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీ మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్‌బాషా, రెడ్డీశ్వర రెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, పోకలచంద్ర, ఆనంద, చెంచురెడ్డి,, నాగరాజ ప్రసాద్, రాయల్ మోహన్, రాణెమ్మ, ప్రభాకర్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నవమి వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి

106 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చెరువు ముందరపల్లెలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

మంత్రి రోజా నామినేషన్ రేపే



నగరి : వైఎస్సార్‌సీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు పుదుపేట అగర వినాయక స్వామి ఆలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మంత్రి కార్యాలయం బుధవారం వెల్లడించింది.

'నవమి'.. నమామి!





జిల్లాలో ఉన్నత స్థానంలోని అధికారులు.. ఆపై ఎన్నికల హడావిడి.. ఏర్పాట్లపై సమీక్షలు. వరుస సమావేశాలు.. క్షణ తీరిక లేని పరిస్థితి. అయితే మన సంస్కృతి.. సంప్రదాయాలు.. పండుగలకు అధిక ప్రాధాన్యమిస్తారు. అందులో భాగంగానే బుధవారం శ్రీరామ నవమి వేడుకల్లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ, జేసీ శ్రీనివాసులు భాగస్వాములయ్యారు. చిత్తూరులోని మిట్టూరు పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న రామమందిరంలో నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొన్నారు. సీతారాములకు పట్టువస్త్రాలను సమర్పించారు. కనులపండువగా దేవదేవేరుల కల్యాణోత్సవం జరిపించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, సుబ్బరాజు తదితరులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.– చిత్తూరు అర్బన్

క్లుప్తంగా

లక్కనపల్లె వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

బైరెడ్డిపల్లె : మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలో విధులు నిర్వర్తించే వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ నేతల వేధింపులు తాళలేక ఉద్యోగాలను వదిలేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాసేవలో చిత్తశుద్ధితో పనిచేసే తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని మండిపడ్డారు. అందుకే వలంటీర్ పోస్టులకు రాజీనామా చేసి, ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవనున్నట్లు తెలిపారు.

మద్యం స్వాధీనం : ఒకరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం : మండలంలోని కొల్లాగుంటలో బుధవారం అక్రమంగా దాచి ఉంచి 156 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. తమకు అందించిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఆవుల వెంకటకృష్ణ తమ సిబ్బందితో దాడి చేసి లవకుమార్ అనే వ్యక్తి నిల్వ చేసిన మద్యం సీజ్ చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 34, 050 ఉంటుందని వివరించారు. దాడిలో ఏఎస్‌ఐ మునికృష్ణ, సిబ్బంది రాజశేఖర్, బాబు పాల్గొన్నారు.

బోరు కేబుల్ చోరీ

చౌడేపల్లె : గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరుకు అమర్చిన కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సర్పంచ్ విజయకుమారి శుక్రవారం తెలిపారు. చారాల పంచాయతీ జంగాలపల్లెకు తాగునీటి కోసం గ్రామం సమీపంలో బోరు ఏర్పాటుచేశారు. గురువారం రాత్రి కేబుల్ చోరీ చేసిన దుండగులు ఫీజు క్యారియర్లను ధ్వంసం చేశారు. దీంతో పంచాయతీకి సుమారు రూ:25 వేలు నష్టం వాటిల్లినట్లు సర్పంచ్ వెల్లడించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

- విభేదాలు వీడి ఏకమైన నేతలు
- మంత్రి రోజా వెంటే నడుస్తామని ప్రకటన

గెలుపే లక్ష్యం.. సమష్టిగా పయనం



మంత్రి ఆర్‌కే రోజాతో వైఎస్సార్‌సీపీ నేతలు



సొంత గూటికి చేరుకున్న నేతలతో మంత్రి రోజా

పుత్తూరు : వారందరూ వైఎస్సార్‌సీపీ నేతలే.. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన వారే.. అయితే ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ విద్రోహులు అపోహలు సృష్టించడంతో మంత్రి ఆర్‌కే రోజాకు దూరమయ్యారు. పరిస్థితుల కారణంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే కాలం వారి మధ్య ఉన్న దూరాన్ని తొలగించింది. నిజానిజాలను పార్టీ నేతలు తెలుసుకున్నారు. ఇంతకాలం మంత్రితో తమకున్న అనుబంధాన్ని దూరం చేసింది అపోహలే వారికి స్పష్టంగా అర్థమైంది. ఇక ఒక్క క్షణం కూడా ఆగకుండా మంత్రి రోజా, ఆమె భర్త ఆర్‌కే సెల్వమణి వద్దకు తమ అనుచరగణంతో కలిసి పరుగుపరుగున వచ్చేశారు. అపోహల వీడి ఆప్యాయతలను పంచుకున్నారు. రోజమ్మతోనే ఇక తమ ప్రయాణమని, సమష్టిగా ఆమె గెలుపునకు ఎన్నికల్లో పనిచేస్తామని ప్రకటించారు. నేతలందరూ ఒక్కతాటిపైకి రావడంతో వైఎస్సార్‌సీపీ బలాన్ని ఇనుమడింపజేసింది. బుధవారం ఈ ఘటన పుత్తూరు మండలం కేబీఆర్ పురంలో చోటుచేసుకుంది. కేబీఆర్‌పురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్, తిరుమల కుప్పం గ్రామానికి చెందిన సంపత్, కృష్ణసముద్రానికి చెందిన రవి, బాబు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు అహర్నిశలు శ్రమించారు. తర్వాత కొన్ని పొరపొచ్చాలు రావడంతో మంత్రి రోజాతో విభేదించారు. ఇటీవల సందర్భోచితంగా వారు కలుసుకున్న సమయంలో వాస్తవం తెలియవచ్చింది. ఇంతకాలం అనవసరంగా మంత్రికి దూరంగా ఉన్నామని వారు తెలుసుకున్నారు. కేబీఆర్ పురం గ్రామానికి విచ్చేసిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక మంత్రి వెంటే ఉంటామని, ఏ శక్తులూ మమ్మల్ని విడదీయలేవని ప్రకటించారు. పార్టీకి దూరమై టీడీపీలోకి చేరిన వారి అనుచరులను సైతం తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీలో చేర్చారు. నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి కలుసుకోవడం కార్యకర్తల్లో ఆనందం నింపింది. కేబీఆర్‌పురం జనంతో నిండింది.. విజయహోరు వినిపించింది. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ దూరమైన సేనాధిపతులు మళ్లీ వచ్చారని, రెట్టింపుబలం వచ్చిందన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు ఇది శుభపరిణామమని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, పార్టీ మండల అధ్యక్షుడు గోవిందస్వామి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, జేసీఎస్ కన్వీనర్ భాస్కర్ యాదవ్, నాయకులు లక్ష్మణమూర్తి, వెంకటేష్, సుదర్శనం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ‘దూదేకుల’ మద్దతు



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో షేక్‌సయ్యద్‌బాజీ తదితరులు



మాట్లాడుతున్న ముస్లిం పెద్దలు

పుంగనూరు : వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే నూర్బాషా దూదేకుల ముస్లింలు మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌సయ్యద్‌బాజీ తెలిపారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు అన్వర్, తంబళ్లపల్లె ప్రతినిధి చాంద్‌బాషా, రాష్ట్ర నాయకుడు యాసిన్, యూత్ అధ్యక్షుడు మట్టిపాటి బాషాలతో కలసి సదుంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కలిశారు. సయ్యద్‌బాజీ మాట్లాడుతూ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి , ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలతో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. దూదేకుల కులస్తులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సహాయం మరువలేమన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్, అష్రఫ్, మహమ్మద్, ఫక్రుదిన్, రహీమ్, నసీరుద్దీన్, మహమ్మద్ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసే అవకాశమిచ్చినందుకు హర్షం

రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన నామినేషన్ వేయనున్నారు. ఈ క్రమంలో నామినేషన్ దాఖలు చేసే అవకాశాన్ని ముస్లింలకు కల్పించడంపై మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు అంజుమన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ సలీం, జాఫర్, ఇబ్రహీం, సున్నీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లింలు సమావేశమయ్యారు. సలీం మాట్లాడుతూ ముస్లింల చేతుల మీదుగా నామినేషన్లు దాఖలు చేసేందుకు మిథున్ రెడ్డి అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ ఆధ్వర్యంలో రాయచోటికి వెళ్లి మిథున్‌రెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సైతం ముస్లింలకు అండగా ఉంటోందని, హజ్ యాత్రకు నిధులు కేటాయిస్తోందని వివరించారు. ఇనాయతుల్లా షరీఫ్ మాట్లాడుతూ కూటమి పార్టీల అభ్యర్థులను నమ్మకూడదని పిలుపునిచ్చారు. మతతత్వ పార్టీలతో ముస్లింల మనుగడకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ముస్లిం పెద్దలు షా, అజీజ్‌సాహెబ్, ఎంఎఎన్ నూరుల్లా, బీటీఅతావుల్లా, ఎస్‌కేపీ ఖాజా, అయూబ్‌ఖాన్, కరీముల్లా, అలీమ్, బిజీ రఫీ, మన్సూర్, ఇర్ఫాన్, ఖాదర్, షామీర్, అఫ్సర్, అహమ్మద్, మునీర్, అస్మత్, మున్వర్, అజ్మత్ పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం ముత్తుకూరు హరిజనవాడకు చెందిన జి.మొగిలప్ప(67) బుధవారం వేకువజామున తాను ఉన్న బ్యారక్‌లో కుప్పకూలి ఉండడంతో జైలు అధికారులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు రిమాండ్ ఖైదీ కావడంతో సబ్‌జైలర్ రామకృష్ణయాదవ్.. ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, వన్‌టౌన్ సీఐ వలీబాషలకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మొగిలప్ప మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. భార్య రెడ్డెమ్మ మాట్లాడుతూ ఈ నెల 15వతేదీ సాయంత్రం సారాకేసులో తన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపింది. ఎస్‌ఐ శ్రీనివాసులు తన భర్తను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నట్లు చెప్పింది. ఇంతలో తన భర్త చనిపోయాడని , ఎస్‌ఐ శ్రీనివాసులు చిత్రహింసలకు గురిచేసి, కొట్టి చంపేశారని కన్నీరుమున్నీరైంది.

నామినేషన్లకు వేళాయె

సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. గురువారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లాలోని చిత్తూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారుల (ఆర్‌ఓ) కార్యాలయాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆయా కార్యాలయాల్లో ఈ నెల 18 నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ వేసే అవకాశం కల్పించారు.

- నేడే ఎన్నికల నోటిఫికేషన్
- ఆర్‌ఓ కార్యాలయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- సీసీ కెమెరాలతో కట్టుదిట్టంగా నిఘా



పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారుల వివరాలు

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	సెల్ నంబర్
చిత్తూరు పార్లమెంట్	షణ్మోహన్	9491077001
చిత్తూరు అసెంబ్లీ	శ్రీనివాసులు	9491077002
పుంగనూరు	మధుసూదన్‌రెడ్డి	8125120979
నగరి	వెంకటరెడ్డి	9491077099
జీడీ నెల్లూరు	వెంకటశివ	7337027151
పూతలపట్టు	చిన్నయ్య	9491077005
పలమనేరు	మనోజ్‌రెడ్డి	9491077017
కుప్పం	శ్రీనివాసులు	9491074513

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన ఘట్టానికి సమయం ఆసన్నమైంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కాగా గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో ఆర్‌ఓలు నామినేషన్లను స్వీకరిస్తారు. సెలవులు మినహా ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. ఆ తర్వాత ఈ నెల 26 వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29 వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 29వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ఆర్‌ఓలు ప్రకటిస్తారు. నామినేషన్ల సందర్భంగా ఆర్‌ఓ కార్యాలయాల వద్ద 144 సెక్షన్ ను అమలు చేయనున్నారు. అలాగే నామినేషన్ల ప్రక్రియను వీడియోగ్రఫీ, 360 డిగ్రీల్లో సీసీ కెమెరా నిఘా పెట్టారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో సదరు అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి రిటర్నింగ్ కార్యాలయానికి వంద గజాల దూరం వరకు మూడు వాహనాలను తీసుకుని వెళ్లవచ్చు. అలాగే ఆయా ఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు.

నామినేషన్ నుంచే లెక్కలు మొదలు

అభ్యర్థుల ఎన్నికల వ్యయం వారి నామినేషన్ రోజు నుంచి పరిగణలోకి తీసుకుంటారు. ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చు. ఆపై ఖర్చు చేస్తే సదరు అభ్యర్థిని ఎన్నికల పోటీ నుంచి తప్పించే పరిస్థితి ఉంటుంది. నామినేషన్ దాఖలు చేయడానికి జనరల్, బీసీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలను డిపాజిట్‌గా చెల్లించాలి. అభ్యర్థికి రాష్ట్రంలో ఓటు హక్కు ఉండాలి.

ఆన్‌లైన్ లోనూ అవకాశం

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహనాలు, సభలు, ర్యాలీల అనుమతి కోసం ఆయా పార్టీల అభ్యర్థులు ఆ యాప్‌లోనే దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో నామినేషన్‌ను సైతం ఆన్‌లైన్‌లో దాఖలు చేసే అవకాశం కల్పించింది. అయితే ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను రిటర్నింగ్ అధికారికి నేరుగా అందించాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



“ నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశాం. ప్రక్రియలో ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తాం. అన్ని ఆర్‌ఓ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన, పోటీకి అర్హత ప్రకటించే అధికారం ఆర్‌ఓకి మాత్రమే ఉంటుంది.

– షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

సుముహూర్తంలో నామినేషన్

జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి నామినేషన్ పర్వం ప్రారంభం కానుంది. ఈ మేరకు అభ్యర్థులు సుముహూర్తాలను ఎంపిక చేసుకుంటున్నారు. అందులో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తాము నామినేషన్ వేసే తేదీని ఖరారు చేసుకున్నారు.

18వతేదీన : చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ సమర్పించనున్నారు.

19వతేదీన : పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్ సమర్పించనున్నారు. నగరి తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆర్‌కే రోజా నామినేషన్ దాఖలు చేయనున్నారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి, పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ నామినేషన్లు వేయనున్నారు.

24వతేదీన : వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ సమర్పించనున్నారు.

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల పర్వం

– ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు రూరల్: జిల్లాలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ప్రశాంతంగా జరిపించడమే లక్ష్యమని ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నామినేషన్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పూర్తి స్థాయిలో నిఘా పెట్టామన్నారు. అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియ నిబంధనలను పాటించాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ జాగ్రత్తలు తీసుకున్నామని, కట్టుదిట్టంగా నిఘా పెట్టినట్లు వెల్లడించారు.

కామాంధుడిపై కఠిన చర్యలకు ఆదేశం

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం మల్లనూరులో దివ్యాంగురాలిపై లైంగికదాడి చేసిన రమేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఆ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెంకటలక్ష్మి తెలిపారు. బాలికకు మెరుగైన వైద్యసహాయం అందించి ఐసీడీఎస్ వసతి గృహానికి తరలించాలని సూచించినట్లు చెప్పారు. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేశామని, మద్యం మత్తులో అతడు ఈ దురాగతానికి పాల్పడినట్లు గుర్తించామని ఎస్పీ చెప్పినట్లు తెలిపారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారని ఆమె చెప్పారు. కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారని వివరించారు.

దేవుడా.. ఆరేళ్లకే నూరేళ్లు నిండిపోయెనా!



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి శశికళ

- చెరువులో ఈతకు వెళ్లి బాలుడి మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

గంగవరం : అయ్యో దేవుడా.. ఆరేళ్లకే నా బిడ్డకు నూరేళ్లు నిండిపోయెనా అని ఆ తల్లి వేదన చూపరులకు కన్నీరు పెట్టించింది. చెరువులో ఈతకు వెళ్లి మరణించిన బాలుడిని చూసి ఆ గ్రామం విషాదంలో మునిగిపోయింది. వివరాలు.. బైరెడ్డిపల్లి మండలం చీలంపల్లెకు చెందిన బాలాజీ, శశికళ దంపతులుకు కుమారుడు అభినవ్ (6), కుమార్తె(4) ఉన్నారు. వారు మూడు నెలలుగా గంగవరం మండలంలోని నల్లగుట్లపల్లె వద్ద జగన్‌కాలనీలో ఉన్న ఓ ఇంట్లో నివసిస్తున్నారు. బైపాస్ రోడ్డు పక్కన ఓ హోటల్‌లో రోజువారీ కూలీగా శశికళ, పట్టణంలోని ఓ చికెన్ సెంటర్‌లో బాలాజీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తమ పిల్లలను ఇంటి వద్ద వదిలిపెట్టి తల్లిదండ్రులు ఇద్దరూ పనులకు వెళ్లిపోయారు. అభినవ్ తన చెల్లెలు, మరి కొందరు పిల్లలతో కలిసి గ్రామ సమీపంలోని చెరువులో ఈతకు వెళ్లారు. అయితే బాలుడు సరదాగా ఈత కొడుతూ లోపల ఓ గుంతలో చిక్కుకున్నాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. తోటి పిల్లలు పెద్దగా కేకలు వేస్తూ ఊరిలోకి వెళ్లి గ్రామస్తులకు తెలియజేశారు. స్థానికులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. నీట మునిగిన బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు. బిడ్డ మరణించిన విషయం తెలుసుకుని తల్లి శశికళ కన్నీరుమున్నీరుగా విలపించింది. అభినవ్ మృతదేహం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. తల్లిదండ్రుల రోదనలతో గ్రామస్తులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.